నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 14 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

మాతృ మరణాలు ఉండొద్దు..

జిల్లా వైద్యాధికారుల సమీక్షలో కలెక్టర్ గౌతమ్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 13 : జిల్లాలో మాతృ మరణాలను నివారించడంపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాల సమావేశ మందిరంలో జిల్లాలోని వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు ప్రసవ సమయాల్లో వివిధ కారణాలతో మరణాలు చోటు చేసుకుంటున్నాయని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. దేశంలో మాతృ మరణాల రేటు 52 శాతం ఉండగా.. తెలంగాణ రాష్ట్రంలో 42, ఖమ్మం జిల్లాలో 45 శాతంగా ఉందన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి జనవరి 2024 వరకు 9 మరణాలు సంభవించాయని, కారణాలు ఏవైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రసవానంతరం బాలింతలను 45 రోజులపాటు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో వంద శాతం గర్భిణుల వివరాలను నమోదు చేయాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు జరిగేలా చూస్తూ.. ఐరన్, పోలిక్ మాత్రలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కుటుంబ నియంత్రణ, గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాములునాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, హెచ్‌వోడీలు, వైద్యాధికారులు, ఆశాలు, మృతుల అటెండెంట్లు పాల్గొన్నారు.

నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మధుసూదన్‌నాయక్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 13 : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకున్న వారి దరఖాస్తుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఎమ్మెల్సీ ఓటరు నమోదు, రెవెన్యూ సంబంధ అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్‌వో, ఏఈఆర్‌వోల లాగిన్ నుంచి దరఖాస్తుల నమోదు ప్రక్రియను చేపట్టాలన్నారు. మండలాల్లో వివిధ పనులకు సంబంధించి స్లాట్ పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. బల్క్ సమస్యలు, డొంక రహదారులు, పెండింగ్ కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ, రెవెన్యూ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. ఈ-కేవైసీ ప్రక్రియ వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

నల్గొండ బీఆర్ఎస్ సభకు గులాబీ సేన

- ఉమ్మడి జిల్లా నుంచి వందలాది వాహనాల్లో పయనం
- బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన గులాబీ దళపతి కేసీఆర్ ప్రసంగం

నల్గొండకు బయలుదేరిన కార్ల ర్యాలీని ప్రారంభిస్తున్న ఖమ్మం మేయర్ నీరజ, ఆర్జేసీ కృష్ణ

ఖమ్మం, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కృష్ణా పరిధిలోని ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం నల్గొండలో నిర్వహించిన బహిరంగ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీగా గులాబీ శ్రేణులు వెళ్లాయి. ఖమ్మం నగరంతో పాటు మున్సిపాలిటీలు, పల్లెల నుంచి వందలాది వాహనాల్లో సభకు వెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఖమ్మం జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, హరిప్రియా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ మదన్‌లాల్, రాములునాయక్, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు ఉన్నారు. కృష్ణా జలాల పరిరక్షణపై బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగం గులాబీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపింది. భవిష్యత్ కార్యాచరణను ఉద్యమ స్ఫూర్తితో విజయవంతం చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముఖ్యపాత్ర పోషిస్తామని ప్రతినబూనారు.

మధిర : జెండా ఊపి బస్సులను తరలిస్తున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

కల్లూరు : తల్లాడలో ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

భద్రాచలం ఆలయ ఈవో బదిలీని నిలిపివేయాలి

భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భద్రాచలం, ఫిబ్రవరి 13 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిని ప్రభుత్వం కీసర ఆర్డీవోగా బదిలీ చేసిందని, వెంటనే ఆమె బదిలీని నిలిపివేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ప్ల కార్డులు చేబూని మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఆకోజు సునీల్ మాట్లాడుతూ సరిగ్గా ఏడాది క్రితం ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన రమాదేవి ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. పురుషోత్తపట్నంలో ఆలయానికి సంబంధించిన వేలాది ఎకరాల భూముల్లో శాశ్వత కట్టడాలను తొలగించి కాపాడారన్నారు. అటువంటి అధికారిని బదిలీ చేయకుండా ఇక్కడే కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు భీమవరపు వెంకటరెడ్డి, కోలా రాజు, పామరాజు తిరుమలరావు, మల్లెల లోకేశ్, దాసరి శేఖర్, రామోజు రాముడు తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈవో రమాదేవి బదిలీని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. అలాగే ఈవో రమాదేవి బదిలీ అర్థరహితమని, ఆమె బాధ్యతలు స్వీకరించిన తర్వాతే పాలన గాడిలో పడిందని పట్టణ ప్రముఖులు గాదె మాధవరెడ్డి, ఎస్కే అజీమ్ మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో

ప్రైవేట్ కళాశాలల సత్తా

ఆలిండియా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులు

జేఈఈలో సత్తా చాటిన విద్యార్థులతో న్యూవిజన్ చైర్మన్ ప్రసాద్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 : జేఈఈ మెయిన్స్‌లో ఖమ్మంలోని ప్రైవేట్ కళాశాలలు పర్సంటైల్‌తో సత్తా చాటినట్లు ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రకటించాయి. విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటారని పేర్కొన్నారు. గత నెల 27 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఐదురోజులు రెండువిడతలుగా నిర్వహించిన జేఈఈ పరీక్ష ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఈ పరీక్షలకు 7,960 మంది హాజరయ్యారు.

న్యూవిజన్‌దే అగ్రస్థానం

జేఈఈ ఫలితాల్లో న్యూవిజన్ విద్యార్థి అగ్రస్థానం సాధించినట్లు విద్యాసంస్థల అధినేత చుంచు గోపాలకృష్ణ ప్రసాద్ తెలిపారు. కళాశాల విద్యార్థి వర్షిత్ కొప్పుల-99.98, మహాశ్వి-99.96, ప్రభంజన్ జాదవ్-99.87 పర్సంటైల్ సాధించాడన్నారు. రుషిందర్ రెడ్డి-99.81, మురళీకృష్ణ-99.80, శ్రీరామ్-99.80, నితీష్‌కుమార్-99.74, రేవంత్-99.62, సుమంత్-99.62, రీదా సమ్రీన్-99.60, ప్రసున్-99.43, లక్ష్మీప్రణతి-99.41, సుష్మిత-99.26, గోవర్ధన్ సాయి-99.23, సాత్విక్-99.20, దివ్యశ్రీ-99.15, శ్రీచరణ్‌రెడ్డి-99.13, పవన్‌కుమార్-99.11, కేతన్‌కుమార్-99.11 ఉత్తమ పర్సంటైల్‌తో సత్తా చాటారు. ఖమ్మంలో ఏ జూనియర్ కళాశాల సాధించని 99పైగా పర్సంటైల్ 21మంది సాధించారన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్‌లో నూరుశాతం పర్సంటైల్‌తో సత్తాచాటిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్ సీహెచ్ కార్తీక్, డైరెక్టర్ గోపిచంద్, ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు అభినందించారు.

రెజోనెన్స్‌లో... ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులతో రెజోనెన్స్ డైరెక్టర్స్ నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

జేఈఈ మెయిన్స్‌లో రెజోనెన్స్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి అత్యుత్తమ పర్సంటైల్ సాధించారని కళాశాల డైరెక్టర్స్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. కళాశాలకు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి-99.19, రాకేష్‌సుశాంత్-99.78, సాయి శ్రీహర్ష-97.79, వెంకటసాయిచేతన-96.92, అంకుష్‌వర్మ-95.72, శ్రవిష్ట-94.52, రిషిక్-93.18, యశ్వంత్- 92.71 పర్సంటైల్‌తోపాటు మరో 82మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. ఐఐటీ, నీట్, ఎప్‌సెట్ వంటి పోటీ పరీక్షల్లో ఘనవిజయం సాధించేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి అభినందించారు.

కృష్ణవేణి... ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కృష్ణవేణి చైర్మన్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు

జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కృష్ణవేణి కళాశాల అత్యుత్తమ పర్సంటైల్‌ను కైవసం చేసుకున్నట్లు కళాశాల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలకు చెందిన ఉజ్వలా మానస-99.01, నవదీప్-99.29, మెహక్ తబస్సుమ్-94.1, నితిన్-92.97, మోహన్‌రావు-91.74, శ్రీరామ్-91.67, జే సాయి-91.55, ఉమేష్‌చంద్రన్-90.78, శృతి-90.54, శ్యామ్‌శ్రీనియో-90.46, సంధ్య-90.27 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాంచందర్‌రావు, ఇన్‌చార్జి నిరంజన్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

శ్రీచైతన్య... ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

శ్రీచైతన్య కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిష్టాత్మక జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా ర్యాంక్‌లు సాధించారని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. కళాశాలకు చెందిన అభిలాష్-99.88, శ్రీరామ్‌తేజ-99.78, వర్షిత్-99.72, తుషార్‌చౌదరి-99.69, నాగశ్రీ-99.67, శ్రీపూజ-99.56, సాయికుమార్-99.45, నవదీప్-99.44, సాయిదినేష్‌రెడ్డి-99.43, రఘునాథ్-99.40, శ్రీసాత్విక్-99.29, జెమిని నాయక్-99.23 పర్సంటైల్‌తో ప్రతిభ కనబర్చారు. వీరితో99కిపైగా పర్సంటైల్‌తో15 మంది, 98 పర్సంటైల్ పైగా 23మంది, 97 పర్సంటైల్‌కి పైగా 39 మంది, 90 పర్సంటైల్‌కి పైగా 96మంది విద్యార్థులు సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బీ సాయి గీతిక, డీజీఎం చేతన్‌మాథుర్, డీన్ వర్మ, ఏజీఎంలు చిట్టూరి బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్స్ అభినందించారు.

హార్వెస్ట్‌లో... జేఈఈలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్

హార్వెస్ట్ విద్యాసంస్థల్లో 100 మందికిపైగా అడ్వాన్స్‌డ్‌కి అర్హత సాధించారని విద్యాసంస్థల అధినేత రవిమారుత్ తెలిపారు. జస్వంత్-99.94 పర్సంటైల్‌తో, జిగ్నేష్-98.87, రాజ్‌వర్ధన్-98.83, అనీష్-99.78, విశ్వతేజ-99.70, ప్రణయ్-99.39, అభినవ్-99.25, సాయిసుజయ్-99.20తో రాణించారు. 96 శాతానికి పైగా పర్సంటైల్‌ను 19మంది విద్యార్థులు, అలాగే 90శాతానికి పైగా పర్సంటైల్‌ను 43 మంది విద్యార్థులు సాధించారన్నారు. ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు హార్వెస్ట్‌లో చదివిన విద్యార్థులు 25 మంది ఉన్నారని, జిగ్నేష్ ఎంబైపీసీలో చదువుతూ జేఈఈ అత్యుత్తమ పర్సంటైల్‌తో రాణించాడు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.పార్వతిరెడ్డి అభినందించారు.

అడిషనల్ డీసీపీ, ఇద్దరు ఏసీపీలు బదిలీ

13 మంది ఎస్సైలకూ స్థానచలనం

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 13 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న కేఆర్‌కే ప్రసాదరావును టీఎస్‌పీఏకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో టీఎస్‌పీఏ డైరెక్టర్‌గా పని చేస్తున్న కె.రవీందర్‌రెడ్డిని నియమిస్తూ డీజీపీ రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.సారంగపాణిని హైదరాబాద్ ఎస్బీ ఏసీపీగా బదిలీ చేశారు. సత్తుపల్లి ఏసీపీ రామానుజంను బదిలీ చేస్తూ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఆయన స్థానంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీలో పని చేస్తున్న ఏ.రఘును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మరో 13 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కాగా.. బదిలీపై వచ్చిన ఎస్సైలకు జిల్లాలో పోస్టింగ్‌లు కేటాయించారు. కందగట్ల మధుబాబు ఎస్‌హెచ్‌వో బోనకల్, బెజ్జంకి లక్ష్మీభార్గవి ఎస్‌హెచ్‌వో మధిర రూరల్, నారబోయిన సంధ్య ఎస్‌హెచ్‌వో మధిర టౌన్, పర్సిక వెంకటేశ్ ఎస్‌హెచ్‌వో ఎర్రుపాలెం, షేక్ నాగుల్‌మీరా ఎస్‌హెచ్‌వో చింతకాని, ఏ.వంశీకృష్ణ భాగ్యరాజు ఎస్‌హెచ్‌వో వైరా, ఎండీ.ఉఫాతుల్ రఫీ సీఎస్‌బీ ఖమ్మం, బి.సాయికుమార్ వీఆర్ ఖమ్మం, ఎం.సురేశ్ ఖమ్మం, ఏ.రాజేందర్ వీఆర్ ఖమ్మం, ఈ.రాజేశ్ వీఆర్ ఖమ్మం, మేడా ప్రసాద్ వీఆర్ ఖమ్మం, నార్లాపురం రాజారాంకు కారేపల్లి ఎస్సైగా పోస్టింగ్ ఇచ్చారు.

తహసీల్దార్, ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు, ఎంపీడీవోలకు కలెక్టర్ ప్రియాంక ఆల మంగళవారం పోస్టింగ్‌లు కేటాయించారు. గుండాల తహసీల్దార్‌గా ఇమ్మానియల్, పాల్వంచకు వివేక్, టేకులపల్లికి నాగభవాని, జూలూరుపాడుకు స్వాతి బిందు, ఆర్‌డీవో ఆఫీస్‌కు ఏవో అశోక్‌కుమార్, పినపాకకు సూర్యనారాయణ, కరకగూడేనికి నరేశ్, చంద్రుగొండకు జగదీశ్వర్, దమ్మపేటకు శ్రీనివాస్, చర్లకు ఎం.శ్రీనివాస్, కలెక్టరేట్‌కు తిరుమలాచారి, ఆళ్లపల్లికి శకుంతల, బూర్గంపాడుకు ముజాహిద్‌ను నియమించారు. చండ్రుగొండ ఎంపీడీవోగా అశోక్, మణుగూరుకు శ్రీనివాసరావు, పాల్వంచకు విజయభాస్కర్ రెడ్డి, దమ్మపేటకు రవీందర్‌రెడ్డి, అన్నపురెడ్డిపల్లికి మహాలక్ష్మి, ఆళ్లపల్లికి రమాదేవి, చుంచుపల్లికి అశోక్‌కుమార్, బూర్గంపాడుకు జమలారెడ్డి, పినపాకకు రామకృష్ణ, దుమ్ముగూడేనికి చంద్రశేఖర్, జూలూరుపాడుకు కరుణాకర్‌రెడ్డి, టేకులపల్లికి రవీందర్‌రావు, లక్ష్మీదేవిపల్లికి చలపతిరావు, ములకలపల్లికి భారతి, ఇల్లెందుకు ధన్‌సింగ్, చర్ల మండలానికి ఈదయ్యకు పోస్టింగ్ ఇచ్చారు. బదిలీపై వచ్చిన వారు వెంటనే విధుల్లో చేరి రిపోర్ట్ అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎంపీడీవోలకు పోస్టింగ్‌ల కేటాయింపు

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 13 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు బదిలీపై వచ్చిన ఎంపీడీవోలకు కలెక్టర్ వీపీ గౌతమ్ మంగళవారం స్థానాలు కేటాయించారు. ఏన్కూరు ఎంపీడీవోగా ఎస్.రమేశ్, సత్తుపల్లి డి.చంద్రశేఖర్, డి.అన్నపూర్ణ పెనుబల్లి, ఆర్.చిన్న నాగేశ్వరరావు కల్లూరు, ఎం.చంద్రమౌళి తల్లాడ, బి.సురేందర్ ఎర్రుపాలెం, వి.అశోక్‌కుమార్ రఘునాథపాలెం, శ్రీధర్‌స్వామి ముదిగొండ, జి.సురేందర్ సింగరేణి, జి.రవీందర్ కామేపల్లి, ఎస్.కుమార్ ఖమ్మం రూరల్, బి.వేణుగోపాల్‌రెడ్డి కూసుమంచి, పి.సరస్వతి వైరా, ఏ.రోజారాణి కొణిజర్ల, కె.శేషాద్రి తిరుమలాయపాలెం ఎంపీడీవోగా నియామకమయ్యారు. ఆర్.రామయ్య చింతకాని, ఎల్.రాజు బోనకల్, ఎం.ఎర్రయ్య నేలకొండపల్లి, బి.వెంకటేశ్వర్లు మధిర ఎంపీడీవోగా నియామకమయ్యారు. మండలాలు కేటాయించిన ఎంపీడీవోలు జాయినింగ్ రిపోర్టును జడ్పీ సీఈవోకు అందించారు.

- నేలకొండపల్లిలో రెండో రోజు సాగిన భక్త రామదాసు జయంత్యుత్సవాలు
- రామదాసు కీర్తనలతో మార్మోగిన ధ్యాన మందిరం
- నేడు ముగింపు ఉత్సవాలు

ఏ తీరుగ నను దయజూచెదవో ఇన వంశోత్తమ రామా..!

భక్తరామదాసు కీర్తనలను ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు

కూసుమంచి (నేలకొండపల్లి), ఫిబ్రవరి 13: 'అంతా రామమయం.. ఈ జగమంతా రామమయం', 'శ్రీరామ నీ నామమెంతో రుచిరా', 'ఇదిగో భద్రాద్రి గౌతమి అదిగో చూడండి', 'తక్కువేమి మనకు రాముడు ఒక్కడుండు వరకు..', 'నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి..' అన్న భక్త రామదాసు కీర్తనలతో నేలకొండపల్లిలోని భక్త రామదాసు ధ్యాన మందిరం మార్మోగింది. భక్త రామదాసు జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీభక్త రామదాస విద్వత్ కళాపీఠం చైర్మన్ సాధు రాధాకృష్ణమూర్తి, సభ్యుల నేతృత్వంలో నిర్వహించిన వేడుకలు భక్తిప్రపత్తులతో సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు రాప్రోలు సుబ్రమణ్యం, శ్రీనివాసమూర్తి, డాక్టర్ ఎ.కోదండ రామాచార్యులు, లలితా మహాలక్ష్మి, మాడ భూషి రాజ్యలక్ష్మి, రాధికా మ్యూజిక్ అకాడమి విద్వాంసులు ఆలపించిన భక్తరామదాసు కీర్తనలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. కురిచేటి రజిని భక్త బృందం పఠించిన సుందరాకాండ పారాయణం ధ్యాన మందిరంలో ప్రతిధ్వనించింది. సికింద్రాబాద్ భక్త రామదాస సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ఆలపించిన కీర్తనలు, నృత్యప్రదర్శనలు, ఇతర కళాకారులు ప్రదర్శించిన పేరిణి నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కాగా, చివరి రోజు బుధవారం జరిగే ముగింపు ఉత్సవాలకు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నదని కళా పీఠం సభ్యులు తెలిపారు.

భద్రాద్రిలో జయంత్యుత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 13 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భక్త రామదాసు 391వ జయంత్యుత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం దేవస్థానం ఆస్థాన హరిదాసులు భక్త రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలు పాడి శ్రోతలను ఉర్రూతలూగించారు. అలాగే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ఆలపించిన కీర్తనలు, భక్తి, సంగీత కార్యక్రమం, నాదస్వర కచేరీలు సంగీత ప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పేరిణి నాట్యమంటే ఇష్టం..

భక్త రామదాసు జయంతి ఉత్సవాల సందర్భంగా నేలకొండపల్లి వచ్చి పేరిణి నృత్య ప్రదర్శన ఇవ్వడం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. రామదాసు నడయాడిన ప్రాంతానికి నేను రావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. మా బృందం గతంలో అనేక చోట్ల ప్రదర్శనలు ఇచ్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నేను అతి పురాతన కళ అయిన పేరిణి నృత్యాన్ని నేర్చుకున్నాను. కనుమరుగవుతున్న కళలను నేటి తరం ఔపోసన పట్టాల్సిన అవసరం ఉన్నది.

– కోలాపురం వింధ్య, పేరిణి నృత్య కళాకారిణి